క్లుప్తంగా

వీర జవాన్లను స్మరించుకుందాం

నారాయణపేట టౌన్ : ప్రపంచ దేశాలలోనే ఉత్తమ సంప్రదాయాలను కలిగిన భారతదేశ సంస్కృతి కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పట్టణ వీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు డా.కాత్యన్ రఘునాథ్, బజరంగ్ దళ్ పట్టణ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రేమకు వ్యతిరేకం కాదని, ప్రాశ్చాత్య సంస్కృతి అయిన ప్రేమికుల రోజుకు మాత్రమే వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. దేశరక్షణ కోసం నిరంతరం సరిహద్దుల వద్ద శ్రమిస్తూ వీరమరణం పొందిన జవాన్లను స్మరించుకుందామన్నారు. 14న ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా నివాళి అర్పించాలని పిలుపు నిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మరికల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటనిది. ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మహబూబ్‌నగర్‌కు చెందిన రాజేందర్‌గౌడ్ ఆదివారం మరికల్ నుంచి కారులో మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా పెద్దచింతకుంట స్టేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీ కొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన ఇతర వాహనదారులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

14న చలో హైదరాబాద్

నారాయణపేట టౌన్ : అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం, హక్కులు, ఐసీడీఎస్ పరిరక్షణ కోసం ఈనెల 14న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు గౌరవాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కన్వీనర్ బాల్‌రాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట, మద్దూర్, మక్తల్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాకు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

నారాయణపేట టౌన్ : పట్టణంలో మున్సిపల్ కార్మికులు కేవలం ప్రధాన రహదారులు మాత్రమే ఊడ్చేస్తున్నారని, కానీ వార్డులో పలు కాలనీలో చెత్తచెదారం ఊడ్చకుండా వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో కొందరు రోడ్లపై బాధ్యతా రాహిత్యం వేస్తున్న చెత్త ఎక్కడికక్కడే కుప్పలుగా దర్శనమిస్తోందని చెబుతున్నారు. ఫలితంగా పందులు, కుక్కలు అక్కడే నివాసం ఏర్పాటు చేసుకొంటున్నాయని వాపోతున్నారు. విషయంపై పలు మార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విరాళాల సేకరణ

దామరగిద్ద: మండల కేంద్రమైన దామరగిద్దలో బొడ్రాయి స్థాపనకు నిర్వాహకులు విరాళాల సేకరణ చేపట్టారు. వన్నాడ విండో అధ్యక్షుడు ఈదప్ప, ఎంపీపీ నర్సప్ప, వన్నాడ చంద్రకాంత్, గజలప్ప, శరణప్పల సమక్షంలో బొడ్రాయి స్థాపన కమిటీ ఏర్పాటు చేశారు. మొదటి రోజు రూ. 55,000 విరాళాలు సేకరించినట్లు తెలిపారు. అశోక్, కన్నిరెడ్డి, బస్వంత్‌రాజ్, గలజప్ప మాణిక్, నారాయణ, ఆనంద్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ లేఅవుట్లపై ఆంక్షలు ఎత్తివేయాలి

నారాయణపేట: పంచాయతీ లేఅవుట్‌ల పై ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఎత్తివేయాలని బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అన్సారీ, రాష్ట్ర కో కన్వీనర్ వీర బసంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణపేట పట్టణంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల కోట్లాది నిధులు సమకూరుస్తున్నాయని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పై సుమారు 6 లక్షల మంది ఆధారపడి జీవనం సాగిస్తునాన్నరన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం డబుల్‌బెడ్ రూంలు, హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి.శివాజీ, కార్యనిర్వహణ అధ్యక్షులుగా రవిగౌడ్, ఉపాధ్యక్షులుగా బి.హన్మంతు, సతీష్, యాసీన్, తఖీ, సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌కుమార్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె. సంగీత, సురేశ్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా విఠోభా, సలహదారులుగా వెంకట్‌రెడ్డి, కోశాధికారి వైడి గుప్తా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

కారు బోల్తా

మక్తల్: మండలంలోని గుడిగండ్ల గ్రామ సమీపంలో ఓ కారు బోల్తా పడిన ఘటనిది. వివరాల్లోకి వెళ్తే హైదరాబాద్‌కు చెందిన మహేష్ రాయిచూర్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా శనివారం రాత్రి సమయంలో గుడిగండ్ల వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. కాగా కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రాత్రి సమయంలో కావడంతో ఎవరు లేకపోవడంతో తమకు తామే బాధితులు కారు అద్దాలు పగులగొట్టి బయటకు వచ్చి ప్రాణాలు రక్షించుకున్నారు.

ముమ్మరంగా పంటల నమోదు

- మండలంలో కొనసాగుతున్న కార్యక్రమం
- నమోదుతో పథకాల అమలు సులభమంటున్న అధికారులు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వైనం


పంట వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

మాగనూర్: మండల కేంద్రమైన మాగనూర్‌తో పాటు పలు గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పది రోజులుగా వ్యవసాయ అధికారులు మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తున్నారు. రైతులు సాగుచేసిన పంటల వివరాలను వేగంగా నమోదు చేస్తున్నారు. మండలంలో మొత్తం 18 గ్రామాలకు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 9 వేల మందికిగాను 4,588 మంది రైతులు తమ పంటల వివరాలను నమోదు చేయించుకున్నారు. సంబంధిత వివరాలన్ని అధికారులు ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. కాగా గ్రామాల్లో ఇప్పటి వరకు 11,560 ఎకరాల్లో వరి, 534 ఎకరాల్లో వేరుశనగ, 30 ఎకరాల్లో పత్తి, 70 ఎకరాల్లో చేరుకు, 150 ఎకరాలల్లో ఇతర పంటలను రైతులు సాగుచేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. పంటల నమోదుతో రైతులు ఏఏ పంటలు పండిస్తున్నారో రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో వీక్షించే అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు. అదేవిధంగా రైతులకు వివిధ పథకాలను సులభంగా అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని అంటున్నారు. రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి ఆన్‌లైన్ వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. పంటల నమోదులో రైతులు పండించిన వివరాల మేరకే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తారని చెబుతున్నారు. దీంతో వ్యాపారులు సేకరించిన ధాన్యం బినామీ పేర్లతో కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికి వీలులేకుండా అడ్డుకట్ట వేయవచ్చని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులకు పంటల నమోదు వల్ల కలిగే ఉపయోగాల గురించి అవగాహన కల్పిస్తున్నామని, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు . రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, తమకు సహకరించాలని కోరుతున్నారు.

వేగంగా నమోదు చేస్తున్నాం



పంటల నమోదు కార్యక్రమం క్లస్టర్ పరిధిలో వేగంగా సాగుతోంది. వివరాలు నమోదు చేయించడం వల్ల అనేక పథకాలు సులభంగా అందించడానికి వీలు అవుతుంది. అదేవిధంగా పంటలను సులువుగా అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. సమస్యలు తలెత్తితే పరిష్కారం త్వరగా లభిస్తుంది.

– ఏలియా, ఏఈఓ, నేరడగం

రైతులు సహకరించాలి



అన్ని గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమం చేపట్టాం. పంటల నమోదు ద్వారా రైతులకు ఎరువులు ఇతర వ్యవసాయ సంబంధమైన సౌకర్యాలు సులభంగా అందుబాటులో ఉంచేందుకు అవకాశం లభిస్తుంది. ఇంకా నమోదు చేసుకోకపోతే సంబంధిత ఏఈఓల సంప్రదించి సహకరించాలి.

– హరిత, ఏఓ, మాగనూర్

పిచ్చి కుక్కల స్వైర విహారం

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సాయి విజయ్ కాలనీలో చిల్డ్రన్ పార్కు దగ్గరలో పిచ్చి కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో చిన్నారులు పార్కుకు వెళ్లేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సింగార్‌బేస్, హాజీఖాన్‌పేట, కుర్వగేరి, సివిల్‌లైన్ రోడ్డు మార్గంలో సైతం కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని పలువురు చెబుతున్నారు. పలు సందర్భాల చాలామందిని అవి గాయపరిచాయని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కుక్కలను సుదూర ప్రాంతాలను తరలించాలని కోరుతున్నారు.

వాహనదారులకు తప్పని తిప్పలు

నారాయణపేట టౌన్ : పట్టణంలో వీధి వ్యాపారులు వ్యాపార సముదాయాలు, కార్యాలయాలు తదితరల చోట్ల తోపుడు బండ్లను ఇష్టారీతిన ఉంచుతున్నారని దీంతో ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. అదేవిధంగా వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. కొందరు ప్రధాన డ్రెయినేజీలపై నిర్మించిన శ్లాబ్‌లపై అక్రమంగా వ్యాపారాలు చేపడుతున్నారని అంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?


పాఠశాల ఆవరణలో పరిస్థితి ఇలా..

మాగనూర్: మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన అదనపు గదుల నిర్మాణం ముందుకు సాగడం లేదు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులు నిర్మాణం అసంపూర్తిగా ఉండడం విద్యార్థుల పాలిట శాపంగా మారుతుంది. అదనపు గదుల కోసం మెట్లను నిర్మించేందుకు ఉంచిన ఇనుప రాడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఆడుకునేందుకు విద్యార్థులు బయటకు వస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఎలాంటి ప్రమాదం జరగక ముందే సమస్య పరిష్కరిచాలని కోరుతున్నారు.

వైస్ చైర్మన్ ఎన్నికపై హర్షం


బండ ప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాస్

దామరగిద్ద: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బండ ప్రకాష్ ముదిరాజ్ తెలంగాణ శాసన మండలి వైస్ చైర్మన్‌గా ఎన్నిక కావడంపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు మాజీ సర్పంచ్ బాపన్‌పల్లి శ్రీనివాస్ ఆదివారం ఆయనను కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముదిరాజ్ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధిలో ముదిరాజ్ నాయకులకు చోటు దక్కడం సంతోషకరమన్నారు. రానున్న ఎన్నికల్లో ముదిరాజ్‌లకు తగిన ప్రాధన్యతను కల్పిస్తూ శాసన సభలోను సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

‘బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం’


మాట్లాడుతున్న జలంధర్‌రెడ్డి

నర్వ: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి జలంధర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల శక్తికేంద్రాల వీధి సమావేశాల సందర్భంగా లక్కర్‌దొడ్డి గ్రామంలో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో బీజేపీ ప్రత్యామ్నయ పార్టీగా ప్రజలు పట్టం కట్టడం ఖాయమన్నారు. బీజేపీ కార్యకర్తలు కష్టపడి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభరీ సుభాష్ చంద్రబోస్ జీ, జిల్లా నాయకులు కుర్వ సత్యం, మండల అధ్యక్షులు మాదిరెడ్డి రవీందర్ రెడ్డి, గంగాధర్‌గౌడ్, రవికుమార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


ఉల్లిగుండంలో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కిష్టారెడ్డి

మరికల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆదివారం సర్పంచ్ కళావతమ్మ సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేయించనున్నట్లు వివరించారు. అనంతరం జెడ్పీవైస్ చైర్ పర్సన్ సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో మట్టి రహదారులను సీసీ రోడ్లుగా మార్చేందుకు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా గ్రామాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సంపత్, విజయ్‌కుమార్‌రెడ్డి, హన్మిరెడ్డి, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటాపూర్‌లో పూజలు చేస్తున్న సర్పంచ్

ఉల్లిగుండంలో ..

దామరగిద్ద: మండలంలోని ఉల్లిగుండం గ్రామంలో ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ కిష్టారెడ్డి, ఎంపీటీసీ కిషన్‌రావ్‌లు ప్రారంభించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సాయిరెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతిల సమక్షంలో నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా మంజూరు చేసిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టిందన్నారు. రోడ్డు నిర్మాణం పట్ల స్థానిక నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. సకాలంలో పనులు పూర్తి చేసి రోడ్డు సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నారాయణరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివభక్తులు



కోస్గి: మండల పరిధిలోని బొల్వోన్‌పల్లి గ్రామానికి చెందిన శివ భక్తులు ఆదివారం శ్రీశైలానికి పాదయాత్రతో బయలుదేరారు. ఈ మేరకు గురుస్వాముల ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 85 మంది శివభక్తులు పాదయాత్రతో బయలుదేరగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు భారీగా తరలివచ్చి సాగనంపారు.

మద్దూరు: మండల కేంద్రంలోని శివభక్తులు ఆదివారం పాదయాత్రగా శ్రీశైలానికి తరలివెళ్లారు. అంతకుముందు మద్దూరు శివాలయంలోని గురుస్వాములు శ్రీనివాస్, అంజప్ప, రాజరాంల ఆధ్వర్యంలో దాదాపు 20 మంది శివభక్తులు ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు ధరించారు.అక్కడి నుంచి మంగళవాయిద్యాల మధ్య పాదయాత్ర ప్రారంభించారు. అలాగే ఖాజీపూర్, నందిపాడ్, నాగిరెడ్డిపల్లి, నిడ్జింత తదితర గ్రామాల నుంచి భక్తులు పాదయాత్రగా బయలు దేరి వెళ్లారు.

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి గ్రామానికి చెందిన శివభక్తులు ఆదివారం శ్రీశైలానికి బయలుదేరారు. అంతకుముందు గ్రామంలోని శివాలయం దగ్గర ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడులు ధరించారు. వారిని సాగనంపడానికి ప్రజలు భారీసంఖ్యలో హాజరయ్యారు. దీంతో ఆ ప్రాంతమంతా శివనామస్మరణతో మార్మోగింది.

శంకరభారతి తీర్థ స్వామికి ఘన స్వాగతం



నారాయణపేట: మైసూర్ ఎడతొరె యోగనందేశ్వర మఠం పీఠాధిపతి శంకర భారతి తీర్థ స్వామి జీకి మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఆదివారం దీక్షిత్ కుటుంబీకులు, ఘట్టణవాసులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని పళ్ల విధిలో ఉన్న 800 ఏళ్ల చరిత్రగల నిమజ్జన మెరుగని వినాయకుని దర్శనానికి ఆయన విచ్చేశారు. లక్ష్మీ గణపతి ఉమామహేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. వినాయకున్ని దర్శించుకున్నారు. అనంతరం స్వామికి పాదపూజ, పుష్పాలంకరణ నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచన చేస్తూ ప్రతి ఒక్కరిలో దైవ భక్తి పెరగాలని సన్మార్గంలో నడుచుకోవాలన్నారు.

దేశ భక్తి పెంపొందించుకోవాలి

నారాయణపేట టౌన్ : ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే దైవభక్తి, దేశభక్తి పెంపొందించుకోవాలని ప్రముఖ శక్తి పీఠం వ్యవస్థాపకులు శాంతానంద్ పురోహిత్ అన్నారు. శ్రీ సాయి హై స్కూల్ 28వ వార్షికోత్సవా వేడుకుల్లో ఆయన ముక్త వక్తగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అడ్వైజర్ మురళీధర్, శేషమ్మ, కరస్పాండెంట్ సాయిలీల, ప్రిన్సిపల్ అభిలాష్, ఉపాధ్యాయులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.



ముస్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

మక్తల్: మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కిసాన్ మోరర్చా అధ్యక్షుడు నర్సింహ రెడ్డి అన్నారు. ఆదివారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్ పురపాలక సంఘంలో రూ.50 లక్షల వ్యయంతో పట్టణంలో మీడియం ప్లాంటేషన్ చేపట్టారని ఇట్టి పనిని చేపట్టడం కోసం ఒక కాంట్రాక్టర్‌కు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా కేటాయించారని అన్నారు. పనిల్లో మట్టిని తీయడానికి చెట్ల నీళ్ల పోయడానికి, పురపాలక సంఘం ట్రాక్టర్‌ను, లేబర్‌ను వినియోగిస్తున్నారని అన్నారు. పురపాలక సంఘంలో శానిటేషన్ వ్యవస్థను గాలికి వదిలేసి సిబ్బందిని కాంట్రాక్టర్‌కు అప్పజెప్పడం సరికాదని అన్నారు. కమిషనర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అడిగితే దాటవేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, కౌన్సిలర్ అనంపల్లి కొండయ్య, కర్నిస్వామి, మల్లికార్జున్, రాజశేకర్‌రెడ్డి, చంద్రశేఖర్, రహీంపటేల్, నర్సింహ, ఎంపీటీసీ తిమ్మప్ప పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కోస్గి: పట్టణంలోని తిమ్మన బావి శివాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 19 వరకు శివపార్వతుల కల్యాణ మహోత్సవంతోపాటు శ్రీ నాభి శిల(బొడ్రాయి) విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 14న మంగళవారం గణపతి గౌరీ పూజ, గోపూజ, అఖండ దీపారాధన, స్వస్తి పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, రుత్విగ్వరణము, విగ్రహాభిషేకం, జలాధివాసం, మంగళహారతి కార్యక్రమం ఉంటుందన్నారు. 15న బుధవారం సర్వతోభద్ర మండపారాధన, లక్ష్మీ గణపతి హవనం, దేవి హోమం, విగ్రహాభిషేకం, ధాన్యాధివాసం, మంగళహారతి, 16న గురువారం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ అనంతరం విగ్రహ సందర్శన, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, వేదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమ అనంతరం సాయంత్రం శ్రీ నాభి శిల(శీతలదేవి) అమ్మవారికి బోనాలు సమర్పణ ఉంటుందన్నారు. అదేవిధంగా 17న వీరభద్ర స్వామి అభిషేకం, శివపార్వతుల కల్యాణం, అన్నప్రసాద వితరణ, 18న శనివారం మహా శివ రాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకొని శివాలయంలో అభిషేకం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల అభిషేకం, 19న ఆదివారం శివ స్వాములకు జ్యోతిర్ముడి ధారణతోపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవం వైదిక తపోనిధి రుద్రాక్షల మఠం అమరలింగ స్వామి ఆధ్వర్యంలో వైదిక రత్న వీరేశలింగం, పరమేష్ శాస్త్రీ, మఠం శివ కుమార్, మఠం వినయ్ కుమార్ సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

మార్మోగిన శివనామస్మరణ


పూజలు చేస్తున్న శివభక్తులు


పాల్గొన్న పంచమ సిద్ధలింగ మహాస్వామి

మక్తల్: ప్రతి ఒక్కరికి భక్తితో ఉన్నప్పుడే మోక్షం లభిస్తుందని, జన్మసార్థకమవుతుందని నేరడుగోమ్ పశ్చిమాద్రిమఠం పీఠాధిపతి సిద్ధలింగ మహాస్వామి అన్నారు. ఆదివారం మక్తల్ మండలం రామసముద్రం గ్రామంలో శివభక్తులు నిర్వహించిన మహాపడిపూజకు హాజరై మాట్లాడారు. శివనామస్మరణల మధ్య, భక్తిశ్రద్ధలతో వైభవంగా కార్యక్రమం నిర్వహించారు. భజనలు చేస్తూ కలశ ఊరేగింపు చేపట్టారు. జ్యోతిర్లింగాల పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఉపసర్పంచ్ అరుణ, మన్యం, శ్రీనివాస్, హన్మంతు, అశోక్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలి

ధన్వాడ: జీవో నంబర్ 8 ప్రకారం తెలంగాణ రాష్ట్రం మొత్తం పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 26వేల పాఠశాలలో 5వేల మందికి పైగా మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారని అన్నారు. వారికి శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదని వాపోయారు. 20 ఏళ్లగా వంటలు చేస్తూ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న వారు ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. ఇచ్చే అరకొర వేతనాలు కూడా సకాలంలో అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేవలం దాని మీదే ఆధారపడిన కుటుంబాలలో ఇళ్ల గడవక పస్తులు ఉండాల్సిన దుస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వం స్పందించాలన్నారు. కార్మికులకు రూ. 21వేలు కనీస వేతనంగా చెల్లించాలన్నారు. ఇందులో కార్మికులు వెంకటమ్మ, భీమమ్మ, లక్ష్మమ్మ, మహేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.